





పార్లమెంట్‌లో ఎంపీలుగా ప్రమాణస్వీకారం చేస్తున్న అంబికా లక్ష్మీనారాయణ, బికె.పార్థసారథి


ఎంపీల ప్రమాణస్వీకారం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీలు సోమవారం నాడు ఢిల్లీలోని పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేశారు. ఇందులో భాగంగా అనంతపురం, హిందూపురం పార్లమెంట్ స్థానాల నుంచి ఎన్నికైన అంబికా లక్ష్మీనారాయణ, బికె.పార్థసారథిలు ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ మెహతాబ్ వారి చేత ప్రమాణం చేయించారు. ఇద్దరు ఎంపీలు తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రధాని, ప్రొటెం స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్, పెనుకొండ

ఆ 'ఒక్క' దానిపైనే చర్చ..!

◆ హిందూపురం 28వ పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్‌పై సందేహాలు ◆ 'అనంత'లో ఇప్పటికీ వెల్లడి కాని ఫారమ్-20



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇప్పుడు ఎక్కడ చూసినా ఆ ఒక్క పోలింగ్ స్టేషన్‌లో వచ్చిన ఆ ఒక్క ఓటు గురించే సర్వత్రా చర్చ నడుస్తోంది. అదేమిటంటే హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని 28వ పోలింగ్ స్టేషన్ గురించి అన్ని చోట్లా చర్చ నడుస్తోంది. ఇది ఎలా సాధ్యమన్న సందేహాలు సర్వత్రా నెలకొన్నాయి. ఏమి జరిగిందోనని రాజకీయ విశ్లేషకులు సైతం తలలు పట్టుకుంటున్నారు. ఎందుకంటే మొన్నటి వరకు అధికారంలోనున్న వైసిపికి ఆ పోలింగ్ స్టేషన్ పరిధిలో పోలైన ఓట్లలో ఒకే ఒక్క ఓటు వైసిపి అభ్యర్థి దీపికకు పడింది. ఓటమి చెందవచ్చు... ఓట్లు తక్కువ రావొచ్చుగానీ మరీ పోలింగ్ స్టేషన్‌లో ఒక్క ఓటు రావటం ఏమిటన్న ప్రశ్నలు అందరి మదిలోనూ మొదలుతోంది. అదే వార్డులో పురపాలక సంఘం ఎన్నికల్లో వైసిపి పార్టీకి చెందిన వ్యక్తి కౌన్సిలర్‌గా గెలుపొందారు. అంతేకాకుండా ఆ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇద్దరు ఏజెంట్లు, వారి కుటుంబాలూ ఉన్నాయి. కాని ఒక్క ఓటే ఎలా వచ్చిందన్నది అంతుబట్టడం లేదని వైసిపి శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. ఏదో మతలబు జరిగిందా అన్న సందేహాలూ వ్యక్తం చేస్తున్నారు.

పోలైన 578 ఓట్లలో వైసికి వచ్చింది ఒక్క ఓటే..

హిందూపురం పోలింగ్ స్టేషన్ నెంబరు 28 ముద్దలాపురం పరిధిలోకి వస్తుంది. ఇక్కడ చేనేతలు, ఇతరులు అధికంగా ఉన్నారు. ఈ పోలింగ్ స్టేషన్ పరిధిలో 578 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 570 ఓట్లు వాలిడ్‌కాగా, ఎనిమిది ఓట్లు నోటాకు పడ్డాయి. 570 ఓట్లలో కాంగ్రెసు అభ్యర్థి ఇనయతుల్లాకు 464 ఓట్లు అత్యధికంగా వచ్చాయి. నియోజకవర్గం అన్నింటిలో కంటే ఇనయతుల్లాకు ఎక్కువ ఓట్లు వచ్చింది ఇక్కడే. ఇకపోతే టిడిపి అభ్యర్థి నందమూరి బాలకృష్ణకు 95 ఓట్లు వచ్చాయి. ఇక వైసిపి అభ్యర్థి దీపికకు ఇక్కడ ఒకే ఒక్క ఓటు వచ్చింది. మిగిలిన ఓట్లు ఇతర అభ్యర్థులకు వచ్చాయి. తక్కిన ఇతర పోలింగ్ స్టేషన్లలో ఎక్కడా ఇంత తక్కువ ఓట్లు వైసిపికి రాలేదు. ఒకే ఒక్క ఓటు రావడం పట్లనే వైసిపి శ్రేణుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

'అనంత'లో ఇప్పటికీ వెల్లడికాని ఫారమ్ 20

అనంతపురం జిల్లాలో ఇప్పటికీ ఎన్నికల ఓట్లకు సంబంధించి బహిర్గత పరచాల్సిన ఫారమ్ 20 ఇప్పటికీ గోప్యంగానే ఉంది. సత్యసాయి జిల్లాలో వీటిని అందజేశారు. అనంతపురం జిల్లాలో మాత్రం ఇప్పటికీ ఫారమ్ 20ని బయటకివ్వకుండా గోప్యంగా ఉంచడం పట్ల కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫారమ్ 20 అంటే పోలింగ్ స్టేషన్ వారీగా ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయన్న వివరాలు పూర్తిగా ఉంటాయి. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు రౌండ్ల వారీగా ఇచ్చారు. పోలింగ్ స్టేషన్ వారీగా ఇవ్వాల్సిన ఫలితాలు బయటకు రాలేదు. వివరాలు ఎందుకు వెల్లడించలేదన్న సందేహాలు అందరిలోనూ ఉండటం గమనార్హం.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రతి అర్జీకి పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్)లో సమస్యలపై ప్రజలు అందించే ప్రతి అర్జీకీ త్వరితగతిన పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన 106 అర్జీలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, గ్రామ వార్డు సచివాలయాల మోడల్ అధికారి శివారెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సమస్య పరిష్కరించాలని, అవినీతిరహిత వ్యవస్థ లక్ష్యంగా పనిచేయాలని ఆదేశిస్తుందన్నారు. సోమవారం ఇచ్చే ఫిర్యాదులన్నింటినీ కలెక్టరేట్‌తో పాటు డివిజన్ మండల స్థాయిలో అధికారులు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. అర్జీదారుల ఆధార్ ఫోన్ నెంబర్ల ఆధారంగా సమస్య ఏ దశలో ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. డయేరియా రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా పంచాయతీ మున్సిపాలిటీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా పైపులు లీక్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో డమేరియా అరికట్టడానికి దశలవారీగా కార్యక్రమాలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజా ఆరోగ్యంపై పంచాయతీ మున్సిపల్ కమిషనర్లు ఇంజినీరింగ్ శానిటరీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలుషిత నీరు ఎక్కడ ఉండరాదని నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పే స్వామి

రేపు ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీ

విజయవంతం చేయండి : గుండుమల

ప్రజాశక్తి-మడకశిర

ఎంఎస్ రాజు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి నియోజకవర్గం వస్తున్న సందర్భంగా ఈ నెల 26వ తేదీ చేపట్టనున్న విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం గుండుమల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బుధవారం పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకూ భారీ ర్యాలీ నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ ఉదయం 10 గంటలకు వాల్మీకి సర్కిల్ చేరుకోవాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, మున్సిపాలిటీతో పాటు ఐదు మండలాల టిడిపి కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై జయప్ర దం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మనోహర్, ఓబులేసు, రామాంజనేయులు, రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ప్రజాశక్తి-మడకశిర


నియోజకవర్గ వ్యాప్తంగా డి.ఎడ్, టిటిసి పూర్తి చేసుకొని డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తన వంతు చేయూతగా ఉచిత శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు రవికుమార్ సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే రాజు సొంత నిధులతో నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా 200 మందికి పైగా ఎస్‌జిటి అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే రెండు రోజుల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

మంత్రి కొల్లు రవీంద్రకు

జిల్లా నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-మడకశిర

కొల్లు రవీంద్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రిగా సోమవారం విజయవాడలోని సచివాల యంలో బాధ్యతలు స్వీకరించారు. దీంతో మంత్రిని ఎపి కుంచిటి ఒక్కలిగ సాధికార సమితి అధ్యక్షులు వివిఎం పాండురంగప్ప, కుమ్మరి శాలివాహన సంఘం కన్వీనర్ పోతులయ్య, కురుబ సంఘం రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ, రామాంజనేయులు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో కొల్లు రవీంద్ర రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షునిగా పని చేసిన సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కన్వీనర్లు హాజరయ్యారు.



మంత్రి కొల్లు రవీంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న వివిఎం పాండురంగప్ప



జగనన్నకాలనీలో జెసిబితో చేస్తున్న మట్టి తవ్వకాలు

పెనుకొండలో

మట్టి మాఫియా..!


అక్రమ సంపాదనకు కాదేది అడ్డున్నట్లు పెనుకొండలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వ పోరంబోకు భూములు, కొండవాలు ప్రాంతాల్లో గ్రావెల్‌ను దోచేస్తున్న ముఠా కన్ను ఇప్పుడు జగనన్న కాలనీపై పడింది. పేదల నివాసం కోసం వేసిన లేఅవుట్లలో అక్రమ తవ్వకాలకు తెరతీశారు. ఒక పక్క ఇళ్లు నిర్మిస్తుండగా, మరో వైపు మట్టి తవ్వుకుపోతున్నారు. యథేచ్ఛగా ఈ వ్యవహారం నడుస్తున్నా హౌసింగ్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. మట్టి తవ్వకాలతో కాలనీల్లో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. వర్షాలు వస్తే నీటికుంటలుగా మారి ప్రమాదాలకు నిలయంగా ఈ ప్రాంతం మారింది.

◆ జగనన్న కాలనీలో యథేచ్ఛగా గ్రావెల్ దోపిడీ

◆ తవ్వకాలతో కాలనీలో ఏర్పడిన పెద్దపెద్ద గోతులు

◆ ప్రమాదాలు సంభవిస్తాయని స్థానికుల ఆందోళన

◆ పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ శాఖలు



తరలించేందుకు ట్రాక్టర్‌లోకి నింపిన మట్టి

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

పెనుకొండ పట్టణంలో 29 ఎకరాల్లో 1100 ఇళ్లు పేదలకు ప్రభుత్వం మంజూరు చేసింది. గూడులేని నిరుపేదలు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి కాలనీలో నివాసం ఉంటున్నారు. కాలనీ పక్కనే ప్రభుత్వం భూమి ఉంది. దీంతో అక్రమ మట్టి వ్యాపారులు ఈ భూమిపై కన్ను పడింది. జెసిబిలతో పట్టపగలే ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేసి దర్జాగా తరలిస్తున్నారు. ఒక ట్రాక్టర్ లోడు మట్టి రూ.1000 నుంచి రూ.1200 వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

స్పందించని అధికారులు...

లేఅవుట్ నుంచి మట్టి తరలింపుపై లబ్ధిదాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదు. గనులు, రెవెన్యూ శాఖ అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమార్కులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలున్నాయి.

ప్రమాదాలకు నిలయంగా..!

లేఅవుట్‌లో కొన్ని చోట్ల ఆరు నుంచి ఎనిమిది అడుగుల లోతు వరకు మట్టి తవ్వేయడంతో ప్రమాదాలకు నిలయంగా కాలనీ మారిందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను అధికారులే ప్రోత్సహిస్తున్నట్లు లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. కొందరు అధికారులు అక్రమ మట్టి వ్యాపారస్తులతో ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపణలు సైతం వ్యక్తతమౌతున్నాయి. ఇప్పటికైన జిల్లా అధికారులు అక్రమ మట్టిత్వకాలపై దృష్టి సారించి అడ్డుకట్టవేయాలని, కాలనీలో ఏర్పడిన గోతులను పూడ్చి వేసి ప్రమాదాలు అరికట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటా



అక్రమ మట్టిత్వకాలపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఉదయశంకరరాజు అన్నారు. అక్రమ మట్టి తరలింపు ఫిర్యాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటున్నామని, సిబ్బంది వెళ్లెలోపు అక్కడి నుంచి అక్రమార్కులు పరారౌతున్నారని ఆయన వివరించారు. అనుమతులు లేకుండా అక్రమ మట్టి, గ్రావెల్ త్వకాలు చేస్తే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఉదయశంకర్ రాజు, తహశీల్దార్ పెనుకొండ.



విజ్ఞాన్ పాఠశాల

'విజ్ఞాన్'లో ఉత్తమ శిక్షణ, నాణ్యమైన విద్య

ఏటా పది ఫలితాల్లో హవా - కరస్పాండెంట్ ఎం.ఫక్రుద్దీన్

ప్రజాశక్తి-ఓబుళదేవర చెరువు

ఉత్తమ శిక్షణ, ఉన్నతమైన విద్యను అందించి విద్యార్థులను తీర్చిదిద్దేలా ఓబుళదేవరచెరువు మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లీషు మీడియం పాఠశాల ముందుకు సాగుతోంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఫక్రుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులకు అనుభవజ్ఞులతో కూడిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య బోధన అందిస్తూ, క్రమశిక్షణను నేర్పుతున్నట్లు చెప్పారు. డబ్బుకు ప్రాధాన్య ఇవ్వకుండా ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రతి ఏటా పదవ తరగతి ఫలితాల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. నవోదయ ,సైనిక్ స్కూల్, ఏపీ ఆర్ఎస్, ఏపీఆర్జేసీ తదితర పోటీ పరీక్షలకు కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు.




విజ్ఞాన్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ సిబ్బంది

పంచాయతీ కార్యదర్శిపై కెవిపిఎస్ ఫిర్యాదు

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లి మేజర్ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతూ, దళిత మహిళా సర్పంచి పట్ల వివక్ష చూపుతున్న పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కెవిపిఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఏవో మురళీకి వినతి పత్రం అందజేశారు. కెవిపిఎస్ నాయకులు మాట్లాడుతూ వారపు సంత గడువు ముగిసి 3 నెలలైనా ఇంతవరకూ వేలం ప్రకటన చేయలేదన్నారు. గతంలో గుత్తేదారుడు ప్రతి వారం పంచాయతీకి రూ. 37 వేలు చెల్లించేవాడు. 12 వారాల నుంచి గ్రామపంచాయతీ కార్యదర్శి, గుమస్తా వారానికి రూ. 15 వేల నుంచి రూ. 17వేలు మాత్రమే పంచాయతీకి చెల్లిస్తున్నారు. ఆ లెక్కన 12 వారాల నుంచి పంచాయతీకి సుమారు రూ. 2.5 లక్షలు నష్టం చేకూరింది. కావున తక్షణమే వారపు సంత వేలం ప్రకటన చేసి పంచాయతీ ఆదాయం పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక గ్రామపంచాయతీ సర్పంచి దళిత మహిళ పూర్తిగా నిరక్షరాస్యురాలు. పరిపాలనా సౌలభ్యం, అభివృద్ధి కోసం పంచాయతీ బోర్డు మీటింగ్‌లో సర్పంచికి భర్త లేదా కొడుకు సహకారం ఉండాలని తీర్మానం చేశారని, అయితే అందుకు విరుద్ధంగా సర్పంచి భర్త, కొడుకు కార్యాలయం లోపలికి రాకూడదని పంచాయతీ కార్యదర్శి మాట పూర్వక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసిందన్నారు. కావున పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోలని, లేనిచో వారం రోజుల తర్వాత కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, మండల కార్యదర్శి వెంకటేశులు, నాయకులు రవి, నర్సింపల్లి ఆంజనేయులు, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయ ఏవో మురళికి వినతిపత్రం ఇస్తున్న కెవిపిఎస్ నాయకులు

చేనేత కార్మిక సంఘం స్థలాన్ని కాపాడండి

సిపిఎం కార్యకర్తలపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లిలో చేనేత కార్మిక సంఘం అనుభవంలో ఉన్న స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమణ నుంచి కాపాడాలని, అతడి అనుచరులు, బంధువులు, కొందరు అధికార పార్టీ నాయకులు చేనేత, సిపిఎం, తదితర ప్రజా సంఘాల నాయకులపై దాడులు చేయటానికి ప్రయత్నిస్తున్నారని వారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ మండల సిపిఎం, చేనేత సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేసన్‌లో ఎఎస్ఐ మురళీకి, రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ అంజనా దేవికి, పెనుకొండ సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ 2016 నుంచి చేనేత కార్మిక సంఘం అనుభవంలో ఉన్న స్థలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి జెసిబిలతో చదును చేస్తుండగా చేనేత కార్మిక సంఘం, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు అడ్డుకున్నారన్నారు. దీంతో వ్యాపారి అనుచరులు, కొందరు అధికార పార్టీ నాయకులు అక్కడికి చేరుకుని వారిని దూషించడంతో పాటు భౌతికదారులకు దిగారని వాపోయారు. కావున రియల్ ఎస్టేట్ వ్యాపారి అమరప్ప, అనుచర వర్గం, అధికార పార్టీ నాయకుల వల్ల సిపిఎం, చేనేత కార్మిక సంఘం నాయకులకు ప్రాణహాని ఉందని వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుని సిపిఎం నాయకులకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రధానంగా ఆ స్థలాన్ని చేనేత కార్మిక సంఘానికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, మండల నాయకులు వెంకటేశులు, సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప, నాయకులు వెంకటేశులు, మాబు, రామకృష్ణప్ప, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీల నారాయణస్వామి, గోవిందప్ప, నజీర్, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ అంజనాదేవికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం, చేనేత సంఘం నాయకులు

'విద్యాకానుక' బూట్లు.. వీధుల్లో విక్రయాలు..!


'విద్యాకానుక' బూట్లను ఆటోలో వీధుల్లో విక్రయిస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వం విద్యాకానుక కింద ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం సరఫరా చేసిన బూట్లు వీధుల్లో విక్రయిస్తున్నారు. ఇవి పట్టణంలోని ఎంజిఎం పాఠశాలకు సరఫరా చేసిన విద్యాకానుక కిట్లలోని బూట్లు అని తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం గత ప్రభుత్వం సాక్స్ నుంచి షూలు, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు విద్యా సామాగ్రి మొత్తం విద్యా కానుక పేరుతో ఆయా పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సరఫరా చేసింది. అందులో భాగంగానే పట్టణంలోని ఎంజిఎం పాఠశాలకు కూడా సరఫరా చేసింది. అయితే అప్పటికే మధ్యాహ్న భోజనం బిల్లులను అడ్డంగా దోచుకోవడానికి అలవాటు పడిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపిస్తూ వచ్చారు. ఆ విద్యార్థుల సంఖ్యకు సరిపడు విద్యా కానుక కిట్లను గత ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిలో పాఠశాల హెచ్ఎం విద్యార్థులందరికీ పూర్తిస్థాయిలో సరఫరా చేయలేదని సమాచారం. దీంతో పాటు మధ్యాహ్న భోజన పథకంలో అడ్డంగా దిగమింగడం కోసం విద్యార్థుల సంఖ్యను మరింత పెంచి చూపించడంతో ఆ సంఖ్యకు అనుగుణంగా విద్యా కానుక కిట్లు ఎంజీఎం పాఠశాలకు ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యాయి. దీంతో విద్యాకానుక కిట్లు పాఠశాలకు ఎక్కువగా వచ్చాయి. మార్చి నెల 22వ తేదీన పాఠశాలలో మిగిలి ఉన్న విద్యా కానుక కిట్లతో పాటు పాఠశాలలో ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలు, కంప్యూటర్ డెస్క్ టాప్ లు, కీ బోర్డు, సిపియు, ఇతర పరికరాలను పాఠశాలలో ఇతర ఉపాధ్యాయులకు కనీసం సమాచారం ఇవ్వకుండా హెచ్ఎం గుజరీ వ్యాపారికి అడ్డంగా విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వచ్చిన డబ్బులను పాఠశాల ఖాతాలోకి జమ చేయాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు జమ చేయలేదని విశ్వసనీయ సమాచారం. ఇలా అడ్డంగా అమ్మేసిన విద్యా కానుక కిట్లలోని బూట్లను కొంతమంది ఆటోలో వేసుకుని పట్టణంలో తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కేవలం జత బూట్లు రూ 50లు అని చెబుతూ విక్రయిస్తున్నారు. ఎంజిఎం పాఠశాలకు వచ్చిన విద్యా కానుక కిట్లు ఎన్ని, ఇందులో విద్యార్థులకు అందించిన కిట్లు ఎన్నిఅన్న అంశంపై ఉన్నతాధికారులు విచారణ చేపడితే అవినీతి బయటపడే అవకాశాలు ఉన్నాయి. దీంతోపాటు నాడు నేడు, పూర్వ విద్యార్థుల సమైక్య ఆధ్వర్యంలో అందించిన నిధుల పైనా అధికారులు విచారణ చేస్తే లక్షలాది రూపాయల అవినీతి బయటపడే అవకాశాలు ఉన్నాయి.

అర్జీలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి బత్తలపల్లి

ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందే అర్జీలపై దృష్టి సారించి వాటిని వెంటనే పరిష్కరించాలని తహశీల్దార్ శివశంకర్ నాయక్ పేర్కొన్నారు.. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించారు.. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రతి అధికారి తప్పక హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ శివనాగప్రసాద్, ఏపీఎం సుదర్శన్ రాజు, మండల ఇంజనీర్ రమణయ్యతో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా విభాగంలో ఆడిట్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో మెప్మా విభాగంలో 2023-24 సంవత్సరంలో జరిగిన లావాదేవీలపై సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆడిట్ చేపట్టారు. ఈ సందర్భంగా సమైక్యల వారీగా ఆయా ఆర్.పిలు చేసిన ఖర్చులు, జమలు, మహిళలు తీసుకున్న రుణాలపై రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సిబ్బంది, మెప్మా అధికారులు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభానికి సన్నాహాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి వారపు సంత మార్కెట్లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ పున: ప్రారంభానికి సన్నాహాలు మొదలుపెట్టారు. అన్న క్యాంటీన్ ప్రారంభించడానికి అందులో ఉన్న వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయాన్ని ఖాళీ చేయించి మరోచోటికి తరలించారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజా ఫిర్యాదులకు వెంటనే పరిష్కారం చూపాలని శ్రీ సత్యసాయి జిల్లా అదనపు ఎస్పీ ఎన్. విష్ణు ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు .అనంతరం పోలీసు అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి పరిష్కారానికి సంబంధించిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. పలువురి సమస్యలకు సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ శ్రీహర్ష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములను కాపాడాలని వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పేదోళ్ల భూములపై పెద్దోళ్లు కన్నేసి దౌర్జన్యం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ పుట్టపర్తి మండలం కప్పలకొండ గ్రామ సర్వే నెంబరు 308-2ఎ, 308-3సి లో 5.13 ఎకరాలు సర్వే నెంబర్ 179-1లో 4.40 ఎకరాలు బోయ సాకే చిన్న నరసింహులు సాకే శ్రీనివాసులు సాకే సుధాకర్ సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే సాయి రమేష్, బొగ్గరం రామకృష్ణ, జగదీష్, శ్రీరాం నాయక్ అనే వ్యక్తులు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. పేదలు తమ పెద్దలనుంచి సాగులో ఉన్న భూమిని తమ హక్కుగా అనుభవిస్తున్నారన్నారు. ఆ భూమికి సంబంధించి వారి దగ్గర ఉన్న పత్రాలు కాలిపోయిన కారణంగా ధనవంతులు వారిని బెదిరిస్తున్నారన్నారు. రెవిన్యూ రికార్డులలో పేదల హక్కుల అనుభవం ఉన్నప్పటికీ విలువ గల భూమిని కాజేయాలని చూస్తున్నారని అన్నారు. పేదల భూమి పేదలకే దక్కాలని ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పైపల్లె గంగాధర్, బాళ్ల అంజి, బాధితులు శ్రీనివాసులు నరసింహులు లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.


సమస్యను జేసీకి వివరిస్తున్న నాయకులు

ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి : వ్యకాసం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని వ్యకాసం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒ రామ్‌కుమార్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చిలమత్తూరు మండలంలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు గత నాలుగు ఐదు వారాల నుంచి బిల్లులు మంజూరు కాలేదని అన్నారు. వంద రోజులు పూర్తి చేసిన ఉపాధి కూలీలకు గడ్డపారలు, పనిముట్లు నాలుగైదు సంవత్సరాల నుంచి ఇవ్వలేదన్నారు. కరువు జిల్లా అయిన సత్య సాయి జిల్లాలో ఉపాధి కూలీలకు 300 రోజుల పని దినాలు, దినసరి కూలీ 600 రూపాయలు ఇవ్వాలని, తక్షణమే పెండింగ్ బిల్లులు మంజూరు చేసి పనిముట్లు ఇవ్వాలని రవాణా చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామచంద్ర, వ్యవసాయ కూలీలు అశ్వత్థరెడ్డి, సుధాకర్, సింహాద్రి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లు సరికాదు


సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

బుక్కపట్నం : బుక్కపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధిలోని కప్పల బండ గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 308 లోని 3ఎ 3బి, 3సి, 3డిలోని ఐదు ఎకరాలు పైగా ఉన్న ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్ కాకుండా ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ రామమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ఈ భూమిని 1969లో సాకే రామన్న అనే వ్యక్తికి పట్టా మంజూరు చేశారని చనిపోయిన తర్వాత వారి పిల్లల అనుభవంలో భూమి ఉందని అన్నారు. అయితే కోట కేశవా అనే వ్యక్తి భూమి తమదేనని మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించాలని చూస్తున్నారని అన్నారు. ఈ భూమి విషయంలో పుట్టపర్తి సివిల్ జడ్జి కోర్టులో బాధితులు దావా వేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్యాళ్ల అంజి, పైపల్లి గంగాధర్, సాకే నరసింహులు, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు..

దోబీఘాట్ ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణంలో రజకుల కోసం దోబీఘాట్,కల్యాణమం డపం ఏర్పాటుకు కృషిచేస్తానని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం టీడీపీ రజక సాదికార సమితి పార్లమెంట్ కన్వీనర్ మాల్యవంతం నారాయణస్వామి ఆధ్వర్యంలో వెంకటాపురంలో పరిటాల శ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. పట్టణంలో రజకుల కోసం దోబీఘాట్, కల్యాణ మండపం ఏర్పాటుచేయాలని రజకసంఘం నాయకులు పరిటాలశ్రీరామ్‌ను కోరారు. స్పందించిన పరిటాలశ్రీరామ్ వాటి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం నాయకులు మస్తానప్ప, మాల్యవంతం వెంకటేశ్, రాజు, రామాంజి, టైలర్ నరసింహులు, రాధాకృష్ణ, తాడిమర్రి వేణు, రమేష్ తదతరులు పాల్గొన్నారు.


పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే


సబ్సిడీ విత్తన వేరుశనగను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కదిరి పట్టణ పరిధిలోని కుటాగుల రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ కాయల పంపిణీని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో రైతులకు బిందు, తుంపర సేద పరికరాలను పంపిణీ చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో తిరిగి వాటిని పున్న ప్రారంభిస్తామని చెప్పారు. అదేవిధంగా రైతాంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. రైతులకు మేలు చేసే ప్రభుత్వం చంద్రబాబు ప్రభుత్వం అని సమస్యలు పరిష్కరించడంలో పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకుంటామని అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందజేసి భూసార పరీక్షలు చేసే కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. రైతన్నలకు మేలు చేసే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేనా పార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ , మండల కన్వీనర్ చెన్నకేశవలు, కౌన్సిలర్లు సావిత్రమ్మ, ఫయాజ్ అలీఖాన్, ఆల్ఫా ముస్తఫా, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మహిళా నాయకురాలు పర్వీన్ భాను, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కదిరి టౌన్ : పట్టణంలోని 25వ వార్డులో మూడు సంవత్సరాలుగా నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించారు. మూడు సంవత్సరాల క్రితం బోరు మరమ్మతులకు గురవడంతో వార్డు ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యను తెలుగుదేశ పార్టీ పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బోరు మరమ్మతులు చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.దీంతో నీటి సమస్య పరిష్కారమైంది.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఖాదర్‌బాషా, సిరాజ్, జునేత్, నిజాం పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చోరీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు స్వీపర్ మునీర్‌బాషాను బెదిరించి చోరీకి పాల్పడ్డారు. 24 ఇనుప కుర్చీలు, 10 ఫైబర్ కుర్చీలు, నాలుగు సీలింగ్ ఫ్యాన్లు, మూడు ఐరన్ ఉక్కు ర్యాకులు ఎత్తుకెళ్లినట్లు గ్రంథాలయ అధికారి జయరాం తెలిపారు. వీటి విలువ 40 వేల రూపాయల వరకు ఉంటుందన్నారు. చోరీ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

అక్రమ నిర్మాణాలపై ఎఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో కప్పల బండ పొలంలో గత 15 సంవత్సరాల క్రితం పట్టా పొందిన స్థలంలోకి కొంతమంది వైసిపి నాయకులు ప్రవేశించి దౌర్జన్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని బాధితులు సోమవారం అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొంతమంది నాయకులు గతంలో దౌర్జన్యాలు చేశారని, ప్రస్తుతం అధికారం పోయినా తమకు ఎవరూ అడ్డు లేరంటూ పెట్రిగిపోతున్నారని బాధితులు వాపోయారు. పుట్టపర్తి మండలం కప్పబండ పొలం లో సర్వే నంబరు 308- 1లో 2.44 ఎకరాల భూమి మహిళా రైతు రాధా రుక్మిణి పేరిట ప్రభుత్వం నుండి పట్టా పొందిందని అన్నారు. అయితే జిల్లా కేంద్రం ప్రశాంతి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, అగ్ని మాపక శాఖ ఉగ్యోగి దౌర్జన్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని వాపోయారు. అంతేకాక తమను బెదిరిస్తున్నారని మహిళా రైతు అదనపు ఎస్పీ ముందు కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే మృతికి ఎమ్మెల్యేల నివాళి

ప్రజాశక్తి ముదిగుబ్బ

మండలంలోని మలకవేమల గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సద్దలపల్లి వెంకటరెడ్డి మృతికి పుట్టపర్తి, కదిరి ఎమ్మెల్యేలు తమ సంతాపం తెలిపారు. ఈ మేరకు సోమవారం జరిగిన వెంకటరెడ్డి అంత్యక్రియల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి ,కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాలొగని మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి భౌతికయానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

కొడిగనహళ్లి పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయండి

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని కొడిగనహళ్లి పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో కలెక్టర్ కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఏపీడీఎస్ నారాయణ మద్దిలేటి రామాంజినప్ప సతీష్ మాట్లాడుతూ గ్రామ సర్పంచి శ్రీరామప్ప ఎనిమిది నెలల క్రితం అనారోగ్య కారణంగా మృతిచెందాడన్నారు. దీంతో ఉప సర్పంచిగా ఉన్న సాకమ్మ సర్పంచిగా చలామణి అవుతున్నారని చెప్పారు. అయితే ఈ పంచాయతీ ఎస్సీ రిజర్వేషన్‌గా ప్రభుత్వం కేటాయించిందని బిసి మహిళ సర్పంచిగా కొనసాగుతున్నారని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొడిగెనహళ్లి పంచాయతీ సర్పంచి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.

టీడీపీతోనే మహిళలకు రక్షణ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

టీడీపీతోనే మహిళలకు రక్షణ ఉంటుందని ధర్మవర నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముతుకూరు బీబీ, పార్లమెంట్ ప్రధానకార్యదర్శి కత్తుల సునీత పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం తెలుగు మహిళలతో కలిసి ఆమె విలేఖరులతో మాట్లాడారు. టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే ఈపుర పాలెం అత్యాచారం, హత్య ఘటనకు సంబందిం చి కేవలం 36 గంటల్లోనే నిందితులను పట్టుకునేలా హోంమంత్రి వంగలపూడి అనిత చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా బాధిత కుటుంబానికి రూ.10లక్షలు ఆర్థిక సాయం కూడా అందించడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలపై ఎన్ని అఘాయిత్యాలు జరిగినా అప్పటి సీఎం కానీ హోంమంత్రి కానీ స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఈ సమావేశంలో తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు స్వర్ణకుమారి, ప్యారీమా, సునంద తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న తెలుగుమహిళలు

వైసిపి నాయకుడిపై చర్యలు తీసుకోండి


ప్రజాశక్తి - పరిగి

మండలంలోని ఊటుకూరులో సర్వేనెంబర్ 279-2 లోని 5.10 ఎకరాల భూమి వ్యవహారంలో వైసిపి నాయకులు జనార్దన్ రెడ్డి చేసిన మోసాలపై తగిన చర్యలు తీసుకోవాలని గంగాధరప్ప అనే వ్యక్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో తహశీల్దార్ రాజేశ్వరికి ఫిర్యాదు చేశారు. హిందూపురానికి చెందిన జనార్దన్ రెడ్డి తమ భూమిపై ఓ ప్రైవేట్ బ్యాంకులో రుణం ఇప్పిస్తానని నమ్మించి పిలిపించి పత్రాలపై సంతకాలతో మోసం చేసినట్లు బాధితులు తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై మార్చి నెలలో తమ భూమికి సంబంధించిన వివరాలతో ఊటుకూరు సచివాలయంలో నోటీస్ బోర్డు వేయడంతో తమకు ఈ విషయం తెలిసిందన్నారు. 2024 మార్చి 18వ తేదీన ఊటుకూరు సచివాలయం నోటీస్ బోర్డులో తమ భూమికి సంబంధించిన ఫామ్ 8ను అతికించారన్నారు. ఆ తరువాత జయమ్మ ఐదుగురికి కోర్టు నుంచి నోటీసులు పంపారని వాపోయారు. తమ భూమిని జనార్దన్ రెడ్డి తనతో పాటు మడకశిరకు చెందిన గంటాల కుసుమ కుమారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్న విషయం తెలిసిందన్నారు. ఈ విషయంపై పూర్తి విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని తహశీల్దార్‌ను బాధితులు కోరారు.

యూట్యూబ్‌లో చేనేత వృత్తి కథ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ఒక చేనేత కార్మికుడు తాను చేస్తున్న చేనేత వృత్తిని వీడియోలో చిత్రీకరించి యూట్యూబ్లో సెండ్ చేసి లక్షలాదిమంది ఫాలోవర్స్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా యూట్యూబ్ నుంచి వచ్చిన షీల్డ్‌ను పట్టణ చేనేత ప్రముఖులు సంధా రాఘవ, సంధారవి, జింకా పురుషోత్తం చేతుల మీదుగా ఆవిష్కరించారు. చేనేత కార్మికుడు చేసిన కృషిని సంధా రాఘవ, సంధారవి, జింకా పురుషోత్తం అభినందించారు. ఈ సందర్భంగా సంధా రాఘవ మాట్లాడుతూ పట్టుపరిశ్రమ దేశంలోనే రెండవ స్థానంలో ఉందని అన్నారు. ధర్మవరం పట్టుచీరలకు ప్రపంచవ్యాప్తంగా ఓ మంచి గుర్తింపు పొందిందని చెపాపరు. పట్టుచీరను తయారు చేయడంలో చేనేత కార్మికుడి కష్టం, శ్రమ, నైపుణ్యత, పని విధానాన్ని విడియో ద్వారా యూట్యూబ్‌లో చిత్రీకరించగా లక్షలాది మంది చూడడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.


చేనేత కార్మికునికి యూట్యూబ్ నుంచి వచ్చిన షీల్డును చూపిస్తున్న దృశ్యం

వైసిపి అక్రమ భవన నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్య సాయి విమానాశ్రయానికి అతి సమీపంలో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయానికి ఎటువంటి అనుమతులు లేవని తగిన చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ పుట్టపర్తి గ్రామ పొలం సర్వేనెంబర్ 666-1 ఎలో 1.30 ఎకరాలు, 666-7లో 0.30 ఎకరాల స్థలంలో వైసిపి కార్యాలయం కోసం అక్రమంగా భవనాన్ని నిర్మిస్తున్నారన్నారు. ఈ భవన నిర్మాణం దాదాపు పూర్తి కావస్తోందన్నారు. దీనికి విమానాశ్రయం అథారిటీ, మున్సిపాలిటీ, పుడా నుంచి గాని అనుమతులు లేవన్నారు. విమానాశ్రయానికి 200 మీటర్ల దూరంలో ఎలాంటి కట్టడాలు ఉండకూడదని నిబంధనలను ఉల్లంఘించి ఈ అక్రమ కట్టడం ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. రూ.20 కోట్ల విలువ చేసే భూమిని వైసీపీ కబ్జా చేసిందన్నారు. ఈ విషయంపై అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, సత్యనారాయణ, మనోహర్, తిరుపాల్ పాల్గొన్నారు.